క్ర.సం. 74774

# జీవమున్న బొమ్మ




కోరుకొండ సత్యానంద్

**రంగనాథంగారు** కుర్చీలో కూర్చున్నారు.

అతని గుండె ఎప్పుడూ ఆనందంగా, తేలికగా ఉంటుంది. అతని బరువైన శరీరం అతని హోదాకు అద్దం పట్టేదిగా ఉంటుంది. కానీ, ఇప్పుడతని గుండె తేలికగా లేదు. అతని మనసు ఆనందంగా లేదు. గుండె బరువెక్కిపోయి, క్రుంగిపోయిన మనిషిలా ఉన్నారు. బాధల వలయంలో చిక్కుకుపోయి చికాకుపడుతున్న మధ్య తరగతి మనిషిలా ఉన్నారు. పీక్కుపోయిన తలతో, విషాదం కొట్టొచ్చినట్లు కన్పిస్తున్న ముఖంతో పిచ్చిపట్టిన మనిషిలా ఉన్నారు.

గడ్డం పెంచుకొని, లోతుకు పోయిన కళ్ళతో ఏదో పోగొట్టుకున్నట్లుగా ఉన్న కొడుకు కోసం భయపడి, హైరానాపడి రూపంలో తనూ ఆ కొడుకులాగే తయారయ్యారు. ఏ తండ్రైనా తన ఒక్కగా నొక్క ముద్దుల కొడుకు ఆ స్థితిలో ఉన్నాడంటే పిచ్చివాడిలా తయారవ్వకుండా, బేజారుపడిపోకుండా, నిద్రాహారాలు మానకుండా ఆనందంగా, హుందాగా, తృప్తిగా ఎలా ఉండగలడు?

రంగనాథంగారికి ఎన్నో ఎకరాల పంట భూములు, ఎన్నో వ్యాపారాలు, ఇనప్పెట్టెలో ఎన్నో లక్షలు ఉన్నాయి. అతనికి అన్నింటితోపాటూ, అన్నింటికంటే ఎక్కువగా ఉన్నది తన ఏకైక సంతానం అయిన మోహన్ మీద ప్రేమ. ఎప్పట్నించో అతనికి లేనిది భార్య, మరో భార్యను తెచ్చుకోవాలన్న ఆలోచన.

కొడుకు తన గుండెలోని రక్తం త్రాగుతానన్నా

ఆనందంగా గ్లాసులో పోసి ఈయగలరు రంగనాథంగారు!

కానీ, ఇప్పుడాయన అశక్తుడు. తన కున్న ఆస్తి అన్నింటినీ తేగలుగుతుంది గానీ...'అది' ఒక్కటే మాత్రం ఇవ్వలేకపోతోంది.

అందుకే అత నెంతలా క్రుంగిపోతున్నాడు.

ఇప్పుడు తనేం చేయాలి? ఏమైనా చేయగలడు తను. కానీ, ఇప్పుడు ఈ పరిస్థితిలో... డబ్బు లేకపోతే తప్ప, మనిషి ఏదైనా చేయగలడు అని అనుకునే వారు రంగనాథంగారు. కానీ, ఆ అభిప్రాయం ఇప్పుడతన్ని అగాధంలోకి త్రోసేస్తూ ఘోరంగా నవ్వుతోంది!

అందుకే ఇప్పుడాయన ఏడుస్తున్నాడు. గుండెలోని రక్తపు ఎర్రని రంగుని కసిగా పీల్చేసి కన్నీటిని ప్రవాహంలా వదిలేస్తుంది బాధ.

ఇప్పుడతని మనసులో ఈ విశ్వమంత భయం ఉంది. అతని గుండెలో ఈ భూగోళమంత భారం ఉంది.

ఇప్పుడతనికి కొడుకు రూపం కనిపిస్తూంది. అతని కళ్ళకు జరగబోయే ఆ దృశ్యం కన్పిస్తూంది. వాడి భవిష్యత్తు అలా ఉంటే...వాడి కోరిక అలా ఉందేమిటి?

ఆనందంగా, దర్జాగా ఏమీ పట్టించుకోని వాడి గుండెలోని కోరికలో కళ అంత ఉన్నత స్థానాన్ని అందుకుందా? అప్పుడప్పుడూ సరదాగా వేసే నాటకాలు వాడిని అంత కళా పిపాసిగా తయారు చేశాయా?

డాబుగా, జోరుగా, హుందాగా ఉండే తన కొడుకు కళాకారుడు కాబోతున్నాడా? తమ వంశంలో వ్యాపారం ఉంది కానీ...అటువంటి కళ ఎప్పుడూ లేదే!?

తప్పు పుట్టాడా వాడు!

హుఁ! నిజమే! వాడు తప్పు పుట్టాడు కాబట్టే వాడి భవిష్యత్తు అలా ఉంది. వాడి కోరికను తీర్చాలి. అయినా అంతకన్నా తనేం చేయగలడు?

అతనికి ఏడుపులో నవ్వు వస్తూంది. నవ్వుతో మరింత ఏడుపు వస్తూంది. కానీ ఎప్పుడూ కన్నీటి ధార వస్తూనే ఉంది.

తాను ఎప్పుడూ, ఎక్కడా ఓడిపోలేదు. కానీ, ఈ కాలం తన నోడిస్తూంది. వాడి భవిష్యత్తు తన గుండెను కొరికేస్తూంది. వాడి మీదున్న ప్రేమతో తన కడుపు తరుక్కుపోతుంది.

కాగిపోతున్న గుండెను విస్కీ పెగ్ మరొకసారి కాల్చింది.

బాధను మరిపించలేని మైకం ఆ బాధకు కారణాలైన సంఘటనల్ని గుర్తుకు తెస్తున్నాయి.

• • • •

ఆ రోజు—

రంగనాథంగారు ఎదురు చూస్తున్నారు. అతని మనసు వికారంగా, గజిబిజి ఆలోచనలతో పిచ్చిగా ఉంది. వ్యాపారంలో వచ్చిన ఎలాంటి సమస్యలైనా చాలా ఈజీగా పరిష్కరించుకోగలిగే రంగనాథంగారు, దేన్నీ అంతగా పట్టించుకొని బాధపడని రంగనాథంగారు, ఏ పరిస్థితికీ భయపడి బాధపడని రంగనాథంగారు... ఈరోజు తనకొచ్చింది ఏమిటో, ఆ సమస్యకు పరిష్కారం ఉంటుందో లేదో అని తెగ ఆలోచిస్తూ బాధపడుతున్నారు.


అది కొడుకు మీదున్న ఆశ, ఆరాటాల ఫలితం!

దేన్నీ పట్టించుకోకుండా, బాధ, ఆందోళన అంటే ఏమిటో తెలియకుండా పెరిగిన కొడుకు పిరుగాలి పోయిన వాడిలా, బాధల సంద్రంలో కొట్టుకు పోతున్న వాడిలా, గుండెలో ఎవరికీ చెప్పకూడని, భరించలేని బాధ ఉన్నవాడిలా ఎందుకు తిరుగుతున్నాడు?

అదే అతని కొచ్చిన అనుమానం. ఆ అనుమానమే పెద్ద సమస్యగా మారిపోయిం దతనికి.

ఆ ఒక్క సమస్యనూ ఆలోచనలు అనేక సమస్యలుగా చిత్రీకరించి అతన్ని సమస్యల వలయంలో చిక్కుకు పోయిన వాడిలా తయారు చేశాయి.

ఈ రోజు వాడు ఎంత రాత్రికి వచ్చినా... అడిగి తీరాలి. వాడి గుండెలోని బాధ ఏమిటో కనుక్కోవాలి. వాడికి ఏది కావాలంటే అదే... ఏదైనా వాడికి అందివ్వాలి...అనుకున్నారు.




అతని ఆలోచనలు కళ్ళకు కన్పించకుండానే, ఘోషిస్తున్న అతని గుండెకు తెలియకుండానే కాలం అర్ధరాత్రి మజిలీకి చేరుకుంది.

పన్నెండు గంటలు కొట్టిన మరుక్షణంలో బజ్జర్ శబ్దం చేసింది. ఆ శబ్దంతో అతని గుండెలోని అలజడి చేస్తున్న శబ్దం ఒక్కసారి ఆగింది. ఆత్రతగా వెళ్ళి తలుపులీశారు రంగనాథంగారు.

తలుపు తెరుచుకున్న మరుక్షణంలో "రంగయ్యా! ఎంతసేపట్నుంచి పిలవాలి...మొద్దు నిద్రా,నువ్వూను" అంటూ విసురుగా వచ్చిన మోహన్ ఎదురుగా ఉన్న తండ్రిని చూసి ఆశ్చర్యపోయాడు.

"డాడీ...మీరా?"

రంగనాథంగారు కొడుకువైపు చూశారు. మరుక్షణంలో అతని గుండె చలించిపోయింది.

"రంగయ్యనుకున్నావా? వాడిని నేనే పడుకోమని చెప్పాను."

"డాడీ!" దెబ్బ తిన్నట్లుగా చూశాడు. "ఎందుకు, డాడీ...ఇంతవరకూ మేలుకొని ఉన్నారేం?" అని అడిగాడు.

"చాలా జీవితాన్ని అనుభవించినవాణ్ణి. ఎంతసేపు మేల్కొని ఉన్నా, ఎక్కడికి వెళ్ళినా, ఇంటికి ఎప్పుడు వచ్చినా జీవితం చివరి దశలో ఉన్న నాకు ఏమీ ఫర్వాలేదు. కానీ, జీవితంలోకి పూర్తిగా ప్రవేశించని నీవు అలా తిరగ్గూడదు...ఏదో పోగొట్టుకున్నవాడిలా ఉండగూడదు."

"డాడీ...నేను..."

"మోహన్...అబద్ధం చెప్పడానికి కష్టపడకు. నువ్వెందుకిలా మారిపోతున్నావో చెప్పు."

"డాడీ...నేనేం మారిపోతున్నాను? ఏమీ లేదు, డాడీ! ఇప్పుడే ఫ్రెండింటికి వెళ్ళి బాతాఖానీలో పడి ఇంత లేటయ్యిం దంతే!"

"నీమీద నాకు నమ్మకం ఉంది. కానీ, కదిలే నీ నాలుక అబద్ధం చెప్తున్నా—పెరిగిన గడ్డం, లోతుకుపోయిన నీ కళ్ళు, నివారిస్తున్నట్లున్న నీ నుదురు.. చెప్పకనే చెప్తున్నాయి నువ్వు చెప్పేవి అబద్ధాలని. బాబూ! నీకు ఏదైనా లోటు కన్పిస్తుందా?"

"లోటా? నాకా? ఏమిటి, డాడీ...మీరు అంటున్నది" అని చిన్నగా నవ్వుతూ అన్నాడు. ఆ నవ్వులో జీవం లేదు. మాటల్లో ప్రాణం లేదు.

"విను, నే నడుగుతున్న ఈ ప్రశ్నకు సమాధానం సూటిగా చెప్పు. పసిపిల్లలు బొమ్మలకోసం ఆశ పడతారు. అవి కావాలని మారాము చేస్తారు. యవ్వనంలో ఎందుకో ఆరాటపడతారు. ఆ ఆరాటం ప్రేమగా మారి, నేను ప్రేమిస్తున్నాను అని చెప్పడానికి సంకోచిస్తారు. భయపడతారు. నువ్వు ఎవరినైనా ప్రేమించావా?"

ఆ ప్రశ్నకు వింతగా చూశాడు మోహన్ తండ్రి వైపు.

"నువ్వు ప్రేమించిన అమ్మాయి నిన్ను కాదందా?"

"నో, డాడీ...మీరేదో ఆలోచిస్తున్నారు. ఇది తండ్రితో అనే మాట కాదు గానీ, నేనే ప్రేమిస్తే ఎంతమంది అమ్మాయిలో మీ కోడళ్ళుగా

రావడానికి సిద్ధంగా ఉన్నారు."

"అవును. నువ్వలాంటి పని చెయ్యవ్. నువ్వు నా కొడుకువి. అయితే ఇదేమిటి? వైరాగ్యమా!"

తండ్రివైపు నవ్వుతూ చూశాడు మోహన్.

"డాడీ! కన్నీటి కడలిలో కొట్టుకు పోతున్నవాడికి, కడుపు ఆకలితో నిండిపోతున్నవాడికి, కష్టాల్లో నలిగిపోయినవాడికి, అప్పుడప్పుడూ అన్నీ అనుభవించేసిన జీవితాలకీ...ఈ విరక్తి, వైరాగ్యాలు కలుగుతాయి. నాకూ జీవితంమీద ఆశ ఉంది. నాకూ నా జీవితం మీద ప్రేమ ఉంది...కానీ...."

"కానీ...?" అనుమానంగా, ఆత్రతగా అడిగారు రంగనాథంగారు.

"ఏం లేదు, డాడీ...ఏం లేదు...కానీ, నాలాంటి వాడికి ఈ విరక్తి వైరాగ్యాలు ఎందుకు ఉంటాయి, డాడీ?" అని చకచకా నడుచుకుంటూ తన గది లోకి వెళ్ళి తలుపు మూసుకున్నాడు మోహన్.

వెళ్ళిపోతున్న మోహన్ కన్నీళ్ళు కారుతున్న కళ్ళను తుడుచుకోవడం గమనించలేదు రంగనాథంగారు. ఇంతవరకు ఆగిన కన్నీటి ధార ఇంక ఆగలేకపోయింది.

● ● ● ●

కారు స్టార్టు అయిన శబ్దం విని రంగనాథంగారు తన గది కిటికీలోంచి బయటకు చూశారు. కార్లో మోహన్ ఉన్నాడు. కారు గేటుదాటి వీధి మలుపు తిరిగింది.

రంగనాథంగారి మెదడులో చటుక్కున ఒక మెరుపు మెరిసింది. గబగబా బట్టలు వేసుకొని బయటకు వెళ్ళి తన కార్లో కూర్చున్నారు. పది నిముషాలు జోరుగా పరుగెత్తినాక కారు ఒకచోట ఆగింది.

అద్దంలోంచి పరిశీలనగా చూశారు రంగనాథంగారు. ఒక ఫర్లాంగు దూరంలో మోహన్ కారు ఆగి ఉంది. గబగబా ఆ మేడవైపుకు వెళ్తున్న మోహన్ కనిపించాడు.

రంగనాథంగారు కూడా కార్లోంచి బయటకు వచ్చి అటువైపుకు నడక సాగించారు.

ఆ మేడ దగ్గరకు చేరుకొని ఒక్క నిముషం అలాగే నిల్చుండిపోయారు. అప్పటి వరకూ అతని గుండెలో ఉన్న ఆందోళన రెట్టింపై ఆత్రత పదం త్రొక్కడం ప్రారంభించింది.

అతని శరీరంలోని ప్రతి అణువూ వణికి పోతూంది భయంతో. ఆత్రతని, భయాన్ని అదుపులో లోకి తెచ్చుకుంటూ లోపలకు దారి తీశారు. ఆ గదిలోకి వెళ్ళేంతలో లోపల్నుండి ఏవో మాటలు వినిపించడంతో అక్కడే నిల్చుండిపోయారు రంగనాథంగారు.

"నో, డాక్టర్! ఈ విషయాన్ని మా డాడీతో చెప్పడానికి వీల్లేదు!"

"అలా అంటే ఎలా, మోహన్? ఈ రిపోర్టు వచ్చాక కూడా నే నీ విషయాన్ని మీ నాన్నగారికి చెప్పకపోతే నేను తప్పు చేసిన వాడి నవుతాను. అది పద్ధతి కూడా కాదు."

"ఓకే, డాక్టర్! మీ ఇష్టం. ఈ రిపోర్టులో ఉన్న విషయం ఆయనకు తెలిస్తే ఏమవుతుందో మీకు తెలుసు. ఆలోచించుకొని మీ ఇష్టం వచ్చినట్లు చేయండి. నే వస్తాను."

కంగారుగా కొట్టుకుంటున్న గుండెతో నిలబడి ఉన్న రంగనాథంగారు కొడుక్కి కనిపించకుండా ప్రక్క గదిలోకి తప్పుకున్నారు. ఐదు నిముషాల తర్వాత చెమటలు పట్టిన ముఖం తుడుచుకుంటూ, ఆలోచనలు వేధిస్తున్న మెదడుతో భారంగా అడుగులు వేసుకుంటూ డాక్టరు ఉన్న గదిలోకి ప్రవేశించారు రంగనాథంగారు.

లోపల డాక్టరు కుర్చీలో కూర్చుని తల వంచుకొని టేబిల్ మీద ఆన్చి ఉన్న చేతులతో తలను పట్టుకొని దిక్కుతోచని వాడిలా, అయోమయంగా ఉన్నాడు.

రంగనాథంగారి రాకను ఆయన గమనించలేదు. రంగనాథంగారు ఆయన ఎదురుగా కుర్చీలో కూర్చున్నారు.

"డాక్టర్!" అన్న మెత్తని పరిచయమైన కంఠం విని చటుక్కున తలెత్తి చూసి కంగారుగా ... "రంగనాథం గారూ ... మీరు ..." అని ఏదో అన బోయాడు.

రంగనాథంగారు విన్నగా నవ్వారు. ఆ నవ్వులో నిండి ఉన్న బాధను గుర్తించలేదు డాక్టరు.

"అంతగా తల పట్టుకుని ఆలోచిస్తున్నారు— తెగని సమస్యేమైనానా?"

"... అవునండి ... ఏం చేయాలో అర్థంకావటం లేదు."

"ఆ సమస్యేమిటో నాకు చెప్పండి. ఆలోచించి ఏం చెయ్యాలో చెప్పడానికి ప్రయత్నిస్తాను."

డాక్టరు తటపటాయించాడు.

"చెప్పండి, డాక్టర్!"

"పొరుగూరి నుండి ఒక పేషెంట్ వచ్చాడు ఆ మధ్య. అతనికి పిల్లికళ్ళుంటాయి. కానీ, అతనికి..."

"...ఆ ... అతనికి!" ఆత్రతను ఆపుకోలేక పోయారు రంగనాథంగారు.

డాక్టరు రంగనాథంగారి వైపు చూశాడు ఆదోలా. రంగనాథంగారి ముఖంలోని భావం అర్థంకాక పోయినా, తన బాధ్యతను నెరవేర్చడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని, నిజం తెలిస్తే ఏమవుతారో అని ఆలోచిస్తూ—"అతనికి ... కాన్సర్! బ్లడ్ కాన్సర్. చాలా ప్రయత్నించాను. పై నుండి వచ్చిన రిపోర్టు కూడా అతని విషయంలో పెదవి విరిచేశాయి" అన్నాడు డాక్టర్.

"అంటే?" రంగనాథం గారి కళ్ళు తేలిపోతున్నాయి.

"అతను ఒక సంవత్సరం లోపునే ..."

"డాక్టర్!" గట్టిగా అరిచారు రంగనాథంగారు.

ఆ అరుపుకి డాక్టర్ బెదిరిపట్లయినా, "రంగనాథంగారూ? ఏమైందండి?" అని అన్నాడు.

"అబ్బే ఏమీ లేదు. ఈ విషయం వాళ్ళ వాళ్ళకు తెలుసా?"

అనుకోని ఈ ప్రశ్నకు అనుమానమేసినా, ఈ విషయం ఎలా చెప్పాలో తెలియక కాసేపు తికమకపడి ఎలాగైనా చెప్పాలనుకొని ..."అతనికి ఒక తండ్రి తప్ప ఎవ్వరూ లేరట ... అతనికి చెప్పొద్దని ఆ పేషెంట్ మరీ మరీ చెప్తున్నాడు."

రంగనాథంగారు వేదన నిండిన ముఖంతో బరువుగా—"మీరేం చేద్దాం అనుకుంటున్నారు?" అని అడిగారు.

"అదేనండి ... నా కేమీ అర్థం కాక ఆలోచిస్తున్నాను."

"డాక్టర్! నే చెప్పినట్లు చేస్తారా?"

"ఏం చెయ్యమంటారు?" రంగనాథంగారి వైపు ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి అడిగాడు డాక్టర్...


"ఆయన తండ్రికి చెప్పేయం[illegible]"

"....."

"ఏం, డాక్టర్, ఆలోచిస్తున్నా[illegible] ఈ విషయం వింటే గుండె పగిలి[illegible] ఆలోచిస్తున్నారా. లేదు, డాక్టర్! [illegible] కొండంత ధైర్యం ఉంది. అం[illegible] ఇంతసేపైనా మీ ఎదురుగా[illegible] కూర్చోగలిగాడు."

డాక్టరుకి షాక్ తగిలినట్లుం[illegible] గారూ!"

రంగనాథంగారు పిచ్చిగా నవ్వారు. [illegible] బాబూ! ఆశ్చర్యపోతున్నావా? ఇందాక మీరిద్దరూ మాట్లాడు




కున్న దంతా విన్నాను. అసలు విషయం తెలియక పోయినా జరిగేది మాత్రం అర్థమయింది. అప్పుడే, అక్కడే చచ్చిపోతే నాకీ బాధ ఉండేది కాదు కానీ, నా గట్టి గుండె నన్ను చావనివ్వలేదు. కానీ, వాడిమీద ప్రేమ నా కడుపు మీద దాడిచేస్తోంది. ఆ బాధ నేను భరించలేక పోతున్నాను ... డాక్టర్! వాడికి ఇంక బ్రతుకే లే ...దా?''

అంతవరకూ నిబ్బరంగా ఉన్న రంగనాథంగారు ఒక్కసారిగా ఏడ్చేశారు. అతని చేతులు వణికిపోతున్నాయి. శరీరం కంపించిపోతోంది.

డాక్టరు తలవంచుకున్నాడు. రంగనాథంగారు బలహీనంగా టేబిల్ మీద వాలిపోయారు.

''డాక్టర్! మరి నా మోహన్ సంగతి అంతేనా? ఎంతైనా ఖర్చు పెడతాను. నా ప్రాణమైనా ఇస్తాను. డాక్టర్... వాడ్ని కాపాడండి ... ప్లీజ్!'' రంగనాథం గారు చిన్న పిల్లాడిలా ఏడుస్తూ డాక్టర్ని అడుగుతున్నారు. డాక్టరుకు ఏం చెప్పాలో అర్థం కావడం లేదు.




''రంగనాథంగారూ! ప్లీజ్, ఏడవకండి. నేనకా, ముందు తప్పితే అందరం పోయే వాళ్ళమే! నేను చేసేంది చేశాను. పై వాళ్ళను కూడా కన్సల్టు చేశాను' ఎక్కడకు తీసుకు వెళ్ళినా శ్రమ, బాధ, ఖర్చు తప్ప... మోహన్‌కి ఇష్టమైనవీ, అడిగినవీ అతని కివ్వండి. అతను కోరింది నెరవ చేయండి. మనం చేయాల్సిందంతే. ఆ పైన దేవుడి దయ.''

రంగనాథంగారు ఏమీ మాట్లాడలేదు. నెమ్మదిగా లేచి బయటకు వెళ్ళిపోయాడు.

● ● ● ●

రంగనాథంగారు మోహన్ గది గుమ్మం దగ్గరకు వచ్చి నిల్చుని లోపలకు చూశారు.

లోపల మోహన్ ఏదో వ్రాసుకుంటున్నాడు. టేబుల్ లైటు వెలుతురులో అతని ముఖం స్పష్టంగా, ముఖ కవళికలు నీరసంగా, నిస్తేజంగా, మృత్యు ముఖంలోకి అడుగు పెడుతున్న మనిషిలా ఉన్నాయి.

రంగనాథంగారికి తన గుండెను ఎవరో పిసికినట్లయింది. దుఃఖం కన్నీటి రూపంలో పెల్లుబికింది. ఆయన భారంగా అడుగులు వేసుకుంటూ మోహన్ దగ్గరకు నడిచారు.

మోహన్ తండ్రి రాకను గమనించలేదు. తీక్షణంగా ఆలోచిస్తూ, తదేకంగా ఏదో వ్రాసుకుంటున్నాడు. అతని నుదుటికి పట్టిన చెమట ఆ కాంతి వెలుగులో ముత్యాల్లా మెరుస్తున్నాయి. అతనికి పట్టిన పీడ భవిష్యత్తును తలచుకొని రంగనాథంగారు కారుస్తున్న కన్నీటి బిందువులు కూడా ఆ కాంతి వెలుగులో ముత్యాల్లాగ మెరుస్తున్నాయి.

''బాబూ...మోహన్ . . .'' రుద్ధ కంఠంతో పిలిచారు రంగనాథం గారు.

మోహన్ తలెత్తి చూశాడు. తపోభంగం కలిగిన మునిపోములా ఉంది మోహన్ ముఖం... కానీ ఆ చూపులో కోపంగానీ, చిరాకు గానీ, విసుగుగానీ కనిపించలేదు.

ప్రశాంత గంభీరమైన దృక్కులతో చూస్తున్నాడు మోహన్.

''ఏం, డాడీ . . . ఇలా వచ్చారేమిటి?''

''ఏం లేదు . . . ఏం రాస్తున్నావ్?''

మోహన్ చిన్నగా నవ్వాడు . . .విరక్తి నిండిన ఆ నవ్వు చూసి రంగనాథం గారు చలించి పోయారు.

''ఏమీ లేదు డాడీ . . .నిద్ర పట్టక ఏదో అలా వ్రాసుకుంటున్నాను.''

''బాబూ! నిన్నొకటి అడుగుతాను . .. సమాధానం చెప్తావా?''

''అడగండి డాడీ!''

''నీ కేమైనా కోరికలున్నాయూ?''

''హు . . . .కోరికలు . . .ఏం, డాడీ? నా జీవితం మీద మీకు నమ్మకం పోయిందా?''

ఆ మాటకు అదిరిపడ్డారు రంగనాథం గారు . . . ''బాబూ! అదేమిట్రా?''

''మీకు నా గురించి తెలుసునని, నా భవిష్యత్తు శూన్యం అని, నా జీవితం చావు గమ్యాన్ని తొందరలోనే చేరబోతుందని మీకు తెలుసని . .. నాకు తెలుసు . . .అందుకేనా అప్పుడే నా ఆఖరి కోరికల్ని అడిగి తీర్చేద్దామని, నా ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆరాటపడుతున్నారు?''

''బాబూ. . . .అవేంమాటలురా ... నిన్ను నేను బ్రతికించుకుంటాను . . .''

''డాడీ! నాకు అన్నీ తెలుసు . . . నా జీవితం జీవితం చేరుకోబోయే తరువాతి గమ్యం మరణం అనీ, దారి తప్పించి బ్రతుకు గమ్యాన్ని ఎవ్వరూ, చివరకు ఆ దేవుడు కూడా చేర్చలేడని . .మరో సంవత్సరం పోస్టైనా నేను ఎలికి బట్టకటు లేనని వ్రాసి ఉన్న కాగితాలు నా దగ్గరే ఉన్నాయి . . . ఆ దేవుడు అప్పుడే నా భవిష్యత్తును కాలం అనే కాగితం మీద వ్రాసి పంపించేశాడు . . .ఈ అదృష్టం కూడా అందరికీ ఉండదు కదు, డాడీ!''

రంగనాథం గారు ఏడుపును ఆపుకోలేకపోయారు. భోరున ఏడ్చేశారు.

''బాబూ! ఆ దేవుడంత నీచుడు, దుర్మార్గుడు మరెవరూ ఉండరు . . . వాడిపోయిన పువ్వును తొడిమకే ఉంచి వికసిస్తున్న పూవును నేలపాలు చేస్తున్నాడు . .తనే బలవంతాన తుంచేస్తున్నాడు.''

''అవును, డాడీ! అప్పుడే వికసించిన పూవులే దేవుడి పాదపద్మాల కడకు చేరడానికి అర్హమైనవి. ఈ పూవు నేల రాలడం లేదు . . . . .దేవుడి పాద పద్మాల దగ్గరకు చేరబోతూంది.''

రంగనాథం గారి ఏడుపు ఆగలేదు. చాలా సేపు ఏడ్చి అలసిపోయారు.

''బాబూ! నన్నేడిపించక చెప్పరా . . .నీకేం కావాలో చెప్పు! నీ ప్రాణం నిలుస్తుంది అంటే నా ప్రాణాన్ని నీకు అందివ్వగలను.''

''డాడీ! తెగిపోయిన గాలి పటాన్ని వెదకడానికి, దాన్ని తీసుకురావడానికని ఎగురుతున్న మరో గాలిపటాన్ని తెంచి పంపిస్తే మొదటిది దొరకదు కదా! రెండవ గాలిపటం కూడా ఎక్కడెక్కడో చిక్కుకుపోయి చిరిగిపోతుంది.''

'బాబూ! ఇలాంటి మాటలతో నన్ను చిత్రవధ చేయకురా . . .ను వ్వుండే ఈ కొద్ది కా . . .''

మధ్యలోనే ఆపేశారు రంగనాథం గారు.

''ఏం, డాడీ, ఆపేశారేం? మమత ఎంత ఆపినా, మనసుకు తెలిసిన నిజం ఆగలేకపోతుంది కదూ! కోరికలు గురించి అడిగారు కదూ! నాకు ఒక కోరిక ఎప్పట్నుంచో ఉండేది. ఇప్పు డది మరింత బలీయమై, పోయే ముందు ఆ కోరికను తీర్చుకోవాలని ఉంది. కానీ, ఆ ఓపిక నాకున్నా, నా కోరిక మీరు తీర్చరేమో, డాడీ!''

''ఏమిటి, బాబూ, అది! చెప్పరా?''

''మీరు డబ్బుకోసం వెనకాడకపోయినా, నాలో మిగిలిన కొద్దిపాటి శక్తిని ఒక్కసారే పోగొట్టుకుంటానంటే మీ రొప్పుకుంటారా, డాడీ?''

''ఇంతకూ అదేమిటో చెప్పు, బాబూ!''

''డాడీ! ఆ దేవుడిచ్చిన ఈ మనసు జీవితం మీద ఆశను పెంచుకుంటూ ఎంతో ఆరాటపడుతుంది. . . .టాటా చెప్పబోతున్న జీవితాన్ని

మరువలేక, విడువలేక నేను — తలవంచుకుని నాకు వీడ్కోలు చెప్తున్న ఆ జీవితం మధ్య ఎన్నెన్ని అగాధాలున్నాయో, ఎన్నెన్ని ఆప్యాయత లున్నాయో, మరింకెన్ని అనుబంధాలున్నాయో అని ఆలోచిస్తూ నేనో నవలను వ్రాస్తున్నాను. దానిలోని నా పాత్రను కొద్దిగా నాటకానుభవం ఉన్న నేనే నటించి, కళాభిమానుల, కళాకారుల గుండెల్లో నన్ను అమితంగా ప్రేమించే మీ కళ్ళలో ఉంచాలని . . . నేను పోయినా అందంగా కదలాడే నా సజీవ ప్రతి బింబాన్ని మీరు చూడగలగాలని ఉంది నాకు . . . అందుకే, ఆ నవలను సినిమాగా తీసి, కళ్ళారా చూసుకుంటూ మరణించాలని ఉంది నాకు . . . మన సంప్రదాయాన్ని గౌరవించే మీకు నా గుర్తుగా ఒక కానుకను కూడా ఇవ్వాలని ఉంది . . .''

''ఏమిట్రా అది . . .?''

''చెప్తాను, డాడీ! ఆ సమయం వచ్చాక తప్పకుండా చెప్తాను . . .ఏం, డాడీ! నా కోరిక తీర్చగలరా?''

''తప్పకుండా, బాబూ! తప్పకుండా. . .నీకు తృప్తి కలిగించే ఏదైనా సరే నేను చేస్తాను . . .కానీ, నటనలో నువ్వు అలసిపోతావేమోనని భయం వేస్తోంది.''

''నో డాడీ! జీవితం పెంచడానికి మందులు లేవు గానీ, కాస్త ఓపికకు మాత్రం మందులు ఉన్నాయి. డాక్టర్లు ఉన్నారు . . . జీవితంలో ఎప్పటికైనా మనిషి అలసిపోతాడు . . . కానీ నేను అలసిపోతేనే నిండు జీవితంలో ఎప్పుడూ సజీవంగా కనిపిస్తాను. . . .ఊ అనండి డాడీ!''

''అలాగేరా'' రంగనాథం గారి గొంతు పూడుకు పోయింది.

● ● ● ●

విస్కీ సీసా ఖాళీ అయింది. అయినా అతని ఆలోచనలు ఆగలేదు. కడుపును బిగబెట్టి బాధ పెడుతుంది బాధ...మండిపోతున్నా, కొడుకుని తలచు కుంటుంటే గుండె కరిగి నీరై పోతుంది.

అతని కన్న హృదయం బద్దలై పోతూంది. మమ కారపు రాగాలు అతన్ని చుట్టి ముట్టి బాధ పెడు తున్నాయి. జరగబోయే ఘోర సంఘటన గుర్తొచ్చి అతని మెదడు పగిలి పోతోంది. మాటలు రాక అతని పెదవులు వణికి పోతున్నాయి.

అలాగే కుర్చీలో ఒక పక్కకు ఒరిగిపోయారు రంగనాథంగారు.

● ● ● ●

చైతన్య బరువుగా మెట్లెక్కుతున్నాడు. మధ్య మధ్యలో తూలుతున్నాడు. మెట్ల మీదనుండి పడి పోతాడేమో అన్నట్లుగా ఉన్నాడు.

అతను తాగలేదు. చైతన్య తాగుబోతు కాడు. ప్రేమికుడు. ప్రేమలో గెలిచిన ప్రేమికుడు. జీవితంలో ఓడిపోయిన జీవుడు.

అతని గుండెలో రక్తపు వరద పొంగుతూంది. ఆ వరద బయటకు ఎప్పుడు విరుచుకు పడదామా కట్ట తెంచుకుని ఎప్పుడు పారిపోదామా అన్నట్లుగా ఉంది.

అతని ముఖం లోని భావాలు జీవితం మీద నమ్మకం పోయినట్లుగా ఉన్నాయి. విరక్తి నిండిన అతను ఒకసారి వేదాంతిలా, మరోసారి విరాగిలా కనిపిస్తున్నాడు.

నీరసంగా, బలవంతంగా మెట్లన్నీ ఎక్కేసి తన గది వైపుకు నడిచాడు. బరువుగా తన గది తలుపుల్ని తోసి, గదినంతా ఒక్కసారి కలయ జూశాడు ఆత్రంగా.

అతనిదృష్టి టేబిల్ మీదున్న దేవకిఫొటో మీద పడింది. అతని ముఖం ఒక్కసారిగా వికసించింది.

తేలిపోతున్న అడుగులతో ఆ టేబిల్ దగ్గరకు వెళ్ళి దేవకి ఫొటోను చేతిలోకి తీసుకుని ప్రేమగా దాని వైపు చూసి తన గుండెకు హత్తుకున్నాడు.

అతని కళ్ళల్లో మిగిలిపోయిన ఆఖరి రెండు కన్నీటిబొట్లు రాలి, చెంపల మీదుగా జాలు వారి పెరిగిన గడ్డంలోకి ఇంకిపోయాయి.

అంతలో అతనిలో ఏదో అలజడి చెలరేగింది. గుండె కదలి పోయింది. గొంతుకు పూడ్చుకు పోయింది. ఆ పూడ్చుకు పోయిన గొంతులోంచి బరువుగా, వేగంగా, బలవంతంగా వస్తున్న దగ్గు మృత్యువు రాకని సన్నాలా ఉంది.

ఆ దగ్గులో ఎన్నో భావాలు, ఎన్నో కోరికలు, ఆశలు ఉన్నాయి.


మరుక్షణంలో అతని నోటి వెంట రక్తం. రక్తపు వరద. తెల్లని చొక్కా నిండా గుండె మీద, తెల్లని దుప్పటి మీద.

అతనిలోని నీరసం అతని జీవితం. పతాక స్థాయికి చేరుకున్నాయి. అంతలో ''చైతన్యా!'' అని బిగ్గరగా అరుచుకుంటూ పరుగు పరుగున వచ్చింది దేవకి.

ఆమెను చూశాడు చైతన్య.

అంతే! అతని కళ్ళు అలాగే విచ్చిపోయాయి.

''బాబూ!'' రంగనాథంగారు గట్టిగా అరిచారు. కానీ, ఆ అరుపు గొంతులోంచి బయటకు రాలేదు. ఆయన వణికి పోతున్నారు. ముఖం అంతా చెమటలు పట్టేసినాయి.



''ఏమైందండి?'' పక్కన కూర్చున్న మరో నటుడు అడిగాడు.

''ఆ. అబ్బే! ఏమీలేదు'' అని పక్క సీట్లోకి చూశాడు.

ఆ సీట్లో మోహన్ లేడు.

''మో...మోహన్ ఏడి నాయనా?''

''ఇప్పుడే వస్తానని ఇందాకనే వెళ్ళాడండి.'' అన్నాడు పక్క నటుడు.

''ఆ. అలాగా. ఇప్పుడే వస్తానండు బాబూ!'' అని సీట్లోంచి లేచి రంగనాథంగారు బయటకు వచ్చారు. బయటంతా చూశారు.

బయట కారు లేదు. మోహన్ కారు మీదే ఇద్దరూ వచ్చారు.

అతనిలో ఆత్రుత బయలుదేరింది. చుట్టూ ఒక్కసారి చూసి టాక్సీని పిలిచారు. డ్రైవర్‌తో వేగంగా పొమ్మని చెప్పారు. పది నిమిషాల్లో కారు ఆ ఇంటి ముందు ఆగింది.

బయట పోర్టికోలో మోహన్ కారు ఆగి ఉంది.

చేతి కొచ్చిన నోటు డ్రైవరు కిచ్చి గబగబా లోపలకు నడిచారు రంగనాథంగారు.

బయట హాలంతా నిశ్శబ్దంగా ఉంది. బయట పనివాళ్ళెవరూ లేకపోవడంతో ''రంగయ్యా. రంగయ్యా'' అని రెండు సార్లు బిగ్గరగా పిలిచారు. సమాధానం రాలేదు.

కానీ, ఎదురుగా ఉన్న తన గది తలుపులు మాత్రం తీసి ఉండడం కనిపించింది —గనాథంగారు ఆశ్చర్యంగా భ్రుకుటి ముడిచి, ఆతృతగా ఆ గదిలోకి వెళ్ళారు.

లోపల ఏ అలికిడీ లేదు. ఎవ్వరూ లేరు.

ఒక్కసారి చుట్టూ చూశారు.

ఫాను తిరుగుతూంది. ఫాను కింద, తన కాట్ మీద మధ్యన తెల్లని కాగితం, దానిమీద పేపర్ వెయిట్ పెట్టి ఉండడం కనిపించాయి.

క్షణకాలం గుండె ఆగినట్లయింది.

గబగబా వెళ్ళి ఆ కాగితాన్ని అందుకుని ఆత్రంగా చదవడం మొదలు పెట్టారు.

"డాడీ!

ఈ ఉత్తరంలోని వాక్యాల్లో నా కున్న జీవితం మీది ఆశ, ఆరాటాలు కనిపిస్తాయి. అందుకే ఎప్పుడూ మీ రనే ముత్యాల్లాంటి అక్షరాలతో వ్రాస్తున్నాను. చదవండి, కానీ, చదివి చలించిపోకండి

డాడీ! అమ్మంటే ఎలా ఉంటుందో తెలియకపోయినా—మీ ప్రేమాభిమానాలతో నన్ను ఎంతో గారాభంగా పెంచి నన్నో మనిషిగా తీర్చి దిద్దారు. మీ ప్రేమను పంచి ఇచ్చారు. కానీ దుర దృష్టవంతుణ్ని. మీ ప్రేమను చివరి వరకూ పొంది, మీకు తోడుగా ఉండలేక పోతున్నాను. అది నేను ఎప్పుడో చేసుకున్న పాపమేమో!

అల్లరి చిల్లరగా వేసిన నాటకాలు నేనో నటుడిగా నిలబడాలన్న ఆశను కలిగించాయి. ఆ ఆశతోనే నేను ఇంకా ఇంకా నాటకాలు వేశాను. నా సొంతంగా రచనకూడా చేశాను. నా కిష్టమైన పాత్రను, అంటే వ్యాధితో కుమిలిపోయే పాత్రను సృష్టించాను. కానీ, ఆ పాత్రే నిజమయ్యింది. ఆ పాత్రే నా జీవిత మయింది. అందుకే నన్ను ప్రేమించే మీకు ఎప్పుడూ జీవమున్న బొమ్మగా కనిపించాలన్న ఉద్దేశంతో, నటన మీద నాకు పెరిగిపోతున్న తపనతో మీకు నా కోరికను లటించినప్పుడు 'సినిమాలో నటించాలని ఉంది' అని కోరుకున్నాను.

డాడీ! నేను ఆ సినిమాను మీ కంటే ముందే చూశాను. అప్పుడు ఎంత పొంగి పోయానో తెలుసా? కారణం. నా సృష్టి, జీవితం కలిసి తెరమీద ఆడు తున్నందుకు, మీకు కదిలే బొమ్మగా ఎప్పుడూ కనిపించే అదృష్టం కలిగినందుకు. నా నటనను చూసుకుని నేనే గర్వపడి పోయాను. ఎందుకో తెలుసునా, డాడీ! అందరూ దాన్ని నటన కాదు— జీవితం, జీవించడం అన్నారు. ముందు ఇక జీవితం లేని నేను ఆ పాత్రలో జీవించానట!

మీకు మరో ముఖ్యమైన విషయాన్ని తెలియ బరచాల్సిన బాధ్యత, అవసరం నా కుంది, డాడీ! నేను మీ ప్రేమను పంచుకున్నాను. అలాగే నా ప్రేమను ఒక స్త్రీ పంచుకుంది. ఆమె పేరు రాధ. ఆమెకు నే నంటే ఎంతో ఆశ. ఆమె అన్నా నాకు అంతే ఆశ.

కారణం ఆమెను నేను ప్రేమించాను. నన్ను ఆమె ప్రేమించింది

ఆమెకు ఒక తండ్రి ఉన్నాడు. ఆయనకు సంప్ర దాయాలు అంటే పిచ్చి ప్రేమాభిమానాలు, గౌరవ మూను. అందుకే ఆయన మా పెళ్ళికి అంగీకరించ లేదు. మీకు ఆ విషయాన్ని చెబుదామనుకున్నాను. కానీ, భయపడ్డాను. ఎందుకంటే మీరుకూడా సంప్రదాయాలకు, కులాలకు, మతాలకు ప్రాధాన్యత ఇస్తారు. మీ సొంత చెల్లెలు ఉన్నా—ఆమె మరో కులానికి చెందిన వ్యక్తిని ప్రేమించి, పెళ్ళి చేసుకుం దని ఆమె ముఖాన్ని చూడలేదింత వరకూ. మరి నేనైతే, కొడుకునైనందుకు, మీరు నన్నెంతగానో ప్రేమించినందుకు ఏం చేస్తారనో, మీ రేమై పోతా రనో భయపడి ప్రేమతో పాటూ పిరికితనాన్ని పెంచుకున్నాను. కొన్నాళ్ళ తరవాత ధైర్యం చేసి మీకు చెబుదామనుకున్నంతలో రాధ తన కడుపులో నా ప్రతిరూపం పెరుగుతూందని చెప్పింది. అది నా తొందరపాటుకు ఫలితం. వద్దన్నా, నేను చేసిన పాపానికి ప్రతిఫలం. అప్పుడైనా ధైర్యం చేసి మీకు చెబుదామనుకున్నంతలో నాకే తెలియకుండా నాలో పెరిగి పోయిన వ్యాధి పైకి వచ్చింది. అప్పుడు ఒక్కసారి నా గుండె కొట్టుకోవడం మానేసింది.

ఆలోచనతో చాలా కాలాన్ని వృథా చేశాను. ఎంత గానో కుమిలి పోయాను. కానీ, రాధకు చెప్పలేదు. ఎందుకో చెప్పలేక పోయాను, డాడీ! నన్ను ప్రేమించి, తల్లిదండ్రుల్ని వదులుకుని నాతో వచ్చిన రాధకు ఇప్పుడు తన జీవితం ఎలా? అన్న పెద్ద ప్రశ్న ఎదు రౌతుంది. నేను నిజాన్ని చెపితే! అంతేకాదు, ఆమె నన్ను పొందిన కారణంగా ఎంతో ఆవేదన్ని పొందుతూంది. ఎన్నో కలల్ని కంటూంది. ఆ కలలు కల్లలని అప్పుడే తెలిస్తే ఆమె జీవితంలో ఆనందం ఈ కొన్నాళ్ళైనా ఉండదు కదు, డాడీ! అందుకేనేమో చెప్పలేక పోయాను. నా తండ్రిని ఒప్పిస్తానని, నాకు ఉద్యోగం వచ్చాక ధైర్యంగా మా డాడీకి చెబుదామని. ఒప్పుకోక పోతే ఆ ఇంట్లోంచే నేనొచ్చేస్తానని చెప్పి ఒప్పించాను. ఆమె నా మాటలు నమ్మింది. మీలా నా లోని నిజాన్ని ఆమె తెలుసుకోలేక—'ఈ మధ్య నీరసం అయిపోతున్నా రేమిటండీ?' అని అనేది. ఒట్టి నలతగా ఉందని, ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా నని ఎప్పటి కప్పుడు సాకులు చెప్పేవాణ్ణి. నమ్ముతూ ప్రేమగా నాకు సపర్యలు చేసేది.

కాని, కాలం మాత్రం ఆగలేదు. మృత్యువు కోరలు చాచుకుంటూ నా వైపుకు రావడం మానలేదు. అంతలోనే రాధ మగపిల్లవాడ్ని కన్నది. అప్పుడు నాకు ఆనందించాలో, ఏడవాలో అర్థం కాలేదు. అప్పుడు కూడా నిజాన్ని బయట పెట్టలేదు.

డాడీ! మన వంశం నాతో ఆగిపోతుందేమోనని భయపడ్డాను. ఇప్పటికీ భయపడుతూనే ఉన్నాను. నేను చేసిన అన్యాయానికి రాధ, నా కొడుకు బలై పోతున్నారు. ఆ బలిని ఆపి, నా ప్రేమను అంగీకరించి వాళ్ళను ఆదరిస్తారని, నా రాధ తన ముందు జీవితాన్ని ఎలా గడుపుతావన్నా మీ రంగీకరించి ఆమెకు అన్నీ సమకూర్చుతారని ఆశిస్తున్నాను. నా కొడుకుని మన వంశోద్ధారకుడిగా, మీ మనవడిగా అంగీకరిస్తారని ఆశిస్తున్నాను.

డాడీ! మీరు నన్ను పెంచారు, ప్రేమించారు. నేను మిమ్మల్ని గౌరవించాను, ప్రేమించాను. రాధ నన్ను ప్రేమించింది. రాధను నేను ప్రేమించాను. ప్రేమించి గారాభంగా పెంచిన మీ ఋణాన్ని తీర్చుకోలేక పోతున్నాను. నన్ను ప్రేమించి, నమ్మి, తన సర్వస్వాన్నీ అర్పించిన రాధ ఋణాన్నీ తీర్చుకో లేకపోతున్నాను. నన్ను కన్నవారినీ, నేను కన్న వారినీ, కంటికి రెప్పలా కాపాడుకోవలసిన వయసులో జీవితాన్నీ వదిలి వెళ్ళిపోతున్నాను. ఏంచేయడానికైనా అశక్తుడ్నే! కాకపోతే బాధ్యతల్ని పెంచి వెళ్ళిపోగలను—అంతే! నా జీవితం, నా నటన, నా సృష్టి కలిసి ఉన్న సినిమాను మీకు అంకితం ఇచ్చాను. అంతేకాదు. నన్ను నమ్మిన జీవితాన్ని ఆదరిస్తారని, అభిమానిస్తారని ఆశిస్తూ, రాధను, బాబును మీకే అప్పగిస్తున్నాను.

ఆఁ...రాధ ఎక్కడుందో మీకు తెలీదు కదూ! ఈ రోజు ఏడు గంటలకు రాధను మనింటికే రమ్మ న్నాను. నన్ను రాధ, రాధను నేను చూసుకునే అదృష్టం ఉందో లేదో?

నేను చేసిందాన్లో, నేను వ్రాసిందాన్లో తప్పు లుంటే మన్నిస్తారని ఆశిస్తున్నాను.

టాటా, డాడీ.
మీ మోహన్."

ఉత్తరం చదవడం పూర్తి చేసిన రంగనాథం గారికి నోట మాట పెగల్లేదు. అతని శరీరం కంపించి పోతూంది. కళ్ళు ఎర్రగా, ఉబ్బినట్లుగా మారి పోయాయి. ఆందోళనా సముద్రం అతన్ని ముంచే స్తూంది.



రంగనాథంగారు గబగబా బయటి పిచ్చిగా, వెర్రిగా చుట్టూ చూశారు.

అతని గదికి ఎదురుగా, మేడ మీది గది తెరిచి ఉన్నాయి.

అది మోహన్ గది.

అతనిలో ఆత్రత ఉప్పెనలా లేచింది. అతని వార్ధకపు బలహీనతను ఆ ఉప్పెన చంపేసింది. ఎలా పరుగెత్తారో, ఎలా మేడ మెట్లెక్కారో అతనికే తెలియలేదు. ఒక్క క్షణంలో అతను మేడ మెట్లెక్కి మోహన్ గది వైపుకు పరుగు తీశారు.

మోహన్ గది గుమ్మం దగ్గరకు వెళ్ళేసరికి లోపలి దృశ్యం అతని కంట పడి స్థాణువే అయి పోయారు. క్షణకాలం అతని గుండెలో రక్తం మాయమై పోయినట్లయింది. మెదడు మొద్దుబారి పోయింది. అప్రయత్నంగా కళ్ళు వర్షిస్తున్నాయి. గొంతు పోయినట్లయింది. నోరు పెగల లేదు.

పెదవుల మీదా, చెంపల మీదా, తెల్లని దుప్పటి మీదా ఎర్రగా పాకిపోయి ఎండిపోయిన రక్తం.. సగం తెరిచి, నీరసంగా, ఆశలు తీరని కళ్ళతో శవంలా పడి ఉన్న మోహన్. ★